ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

కోనసీమ

జిల్లా వార్తలు

మంగళవారం 9 ఏప్రిల్ 2024 | 7



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	సా.6.26
సహరీ (బుధ)	ఉ.4.28

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	35	28





వాడపల్లి వెంకన్న ఆలయంలో ఫలపుష్పాలతో అలంకరణ.. ఫొటోషూట్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు

వాడపల్లిలో ఉగాది సంబరాలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 8: క్రోధి నామసంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. మంగళవారం ఉగాది కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్న దృష్ట్యా క్షేత్రాన్ని ఫలపుష్పాలు, విద్యుత్ కాంతులతో ముస్తాబుచేశారు. భక్తులకు ఫొటోషూట్ కోసం కూడా ప్రత్యేక ఏర్పాట్లు ఏర్పాటుచేశారు. ఆలయ ప్రాంగణంలో ఉగాదిని స్వాగతిస్తూ విశేష పుష్పాలంకరణ చేపట్టారు. ఉదయం పది గంటలకు సరస్వతిదేవి పూజ, పంచాంగ శ్రవణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఉపకమిషనర్ భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

అంతర్వేదిలో ఉగాది ఏర్పాట్లు

అంతర్వేది, ఏప్రిల్ 8: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం పంచాంగశ్రవణం పఠిస్తారని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఆలయమంతా పుష్పాలంకరణతో ముస్తాబు చేశారు. అంతర్వేది దేవస్థానంతోపాటు స్థానికంగా సైకిల్‌షాపు సెంటర్, కేశవదాసుపాలెం, మోరి, వీవీ మెరక, టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లి, రామేశ్వరం, గొంది తదితర గ్రామాల్లోనూ అమ్మవారి ఆలయాల వద్ద ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయా కమిటీలు తెలిపాయి.

‘లీడర్’ కోసం.. కేడర్ చూపు!



- జనసేనలో కొత్త ఇన్‌చార్జుల నియామకమెప్పుడో
- అమలాపురం, ముమ్మిడివరంలలో తాజా చర్చ
- ఇన్‌చార్జులు పార్టీని వీడినా చెక్కుచెదరని కేడర్
- నూతన నాయకత్వంతో దిశానిర్దేశం చేయాలని వినతి
- మౌనం వహించిన నేతలనూ బుజ్జగించాలంటూ పలు నియోజకవర్గాల్లో స్థానిక నాయకుల సూచనలు
- ఇప్పటికే కూటమి అభ్యర్థుల ఎన్నికల ప్రచారంలోకి
- ఇన్‌చార్జులను నియమిస్తే మరింత జోష్

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో జనసేన పార్టీకి చెందిన ఇన్‌చార్జులు సీట్లు దక్కలేదన్న ఆక్రోశంతో స్తబ్దతగా ఉన్న కీలక నేతలు ప్రస్తుతం పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండడంతో ఆ పార్టీ కేడర్‌లో కొంత గందరగోళం నెలకొంది. జనసేన అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకుని ఆ పార్టీకి కంచుకోటగా ఉన్న కోనసీమలో ఇన్‌చార్జుల నియామకంతోపాటు కేడర్‌లోనూ జోష్ నింపాల్సి ఉంది. ఉత్సాహంతో ఉరకలు వేసే యువలోకం ముందుకు సాగుతున్నప్పటికీ వారికి దిశానిర్దేశం చేసే నాయకత్వం మెజార్టీ నియోజకవర్గాల్లో కొరవడిందనే అభిప్రాయం వినిపిస్తోంది. టీడీపీ నుంచి ఉమ్మడి అభ్యర్థులుగా పోటీచేస్తున్న అభ్యర్థులు సైతం జనసేన పార్టీ ఇన్‌చార్జులను నియమించి పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం చేసే నాయకత్వాన్ని పటిష్టం చేయాల్సిన పరిస్థితులపై వారి అభిప్రాయాన్ని సైతం ఇటీవల చంద్రబాబు ముందు వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో చంద్రబాబును ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు కందుల దుర్గేష్ కలిసిన సందర్భంలో ఇదే విషయంపై చర్చ సాగింది. అమలాపురం, ముమ్మిడివరం జనసేన ఇన్‌చార్జులు పార్టీని వీడడంతో అక్కడ తక్షణం కొత్త వారితో ముందుకు సాగాల్సిన అవసరాన్ని దుర్గేష్ కూడా ప్రస్తావించినట్టు సమాచారం. పార్టీ ఇన్‌చార్జి పదవుల్లో ఉన్న జనసేన ఇన్‌చార్జులు ఇద్దరూ ఇప్పటికే వైసీపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థుల తరుపున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటుండగా, జనసేన కేడర్ మాత్రం మొక్కవోని దీక్షతో కూటమి అభ్యర్థుల విజయానికే పూర్తిగా సహకరిస్తున్నారు. జనసేన ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ సీటు దక్కలేదన్న కారణంతో ఆగ్రహం చెంది జనసేన ఇన్‌చార్జి, పార్టీ పదవులకు రాజీనామా చేసి వైసీపీలో చేరారు. ప్రస్తుతం ఇక్కడ ఇన్‌చార్జి లేనప్పటికీ నాలుగు మండలాల్లో ఉన్న జనసేన కీలక నాయకులు పార్టీ పగ్గాలు చేతబట్టి వారిని పొత్తు నిబంధనలకు అనుగుణంగా టీడీపీ అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు విజయం కోసం పనిచేస్తున్నారు. ఇక అమలాపురం విషయానికి వస్తే ఇక్కడ జనసేన ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు చివరి క్షణాల్లో వైసీపీ వైపు మొగ్గుచూపారు. వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని రహస్యంగా కలిసిన వీడియోలు రావడంతో రాజబాబు రాజకీయ భవిష్యత్తుకు గండిపడింది. జనసేన కూడా ఆయనను ఆ రోజు నుంచి పక్కన పెట్టడంతో రాజబాబు వైసీపీలో చేరారు. అటు అమలాపురం జనసేన లోక్‌సభ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న డీఎంఆర్ శేఖర్ సైతం ప్రస్తుతం రాజకీయాలకు దూరంగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రమైన అమలాపురంలో అటు లోక్‌సభ, ఇటు అసెంబ్లీకి ఇన్‌చార్జిలు దూరంగా ఉండడంతో అయోమయ పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్గ విభేదాలు మరింత పెరిగాయి. నాయకత్వం లేకపోవడం కొన్నిచోట్ల గందరగోళ పరిస్థితులనూ సృష్టిస్తోంది. లోక్‌సభ, కూటమి అభ్యర్థులకు ఈ పరిణామాలు కొంత ఇబ్బందికరంగా మారాయి. ఇటీవల అమలాపురంలో టీడీపీ, జనసేన, బీజేపీ సమన్వయ సమావేశం ఏర్పాటుచేసినప్పుడు ఒక వర్గం నాయకులనే పిలిచారంటూ మరొక వర్గం నాయకులు అలకబూనారు. తర్వాత నాయకులు ఏదొక విధంగా బుజ్జగించడంతో ఆరోజు సమస్య తాత్కాలికంగా సమసిపోయింది. ఇక రాజోలులో జనసేన అభ్యర్థిగా సీనియర్ ఐఏఎస్ అధికారి దేవ వరప్రసాద్‌ను ప్రకటించడంతో ఆ సీటుపై ఆశలు పెట్టుకుని ఆగ్రహంతో ఉన్న బొంతు రాజేశ్వరరావు అలకబూనారు. ఇప్పటికీ ఎన్నికల ప్రచారంలో రాజేశ్వరరావు వర్గం జనసేన అభ్యర్థికి దూరంగానే ఉంది. ఇక్కడ జనసేన ఇన్‌చార్జిగా గుండుబోగుల ఆదినారాయణ వ్యవహరిస్తున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ తన సోదరుడైన బండారు సత్యానందరావుతో ఐక్యంగానే ఉంటూ కేడర్‌లో జోష్ నింపుతున్నారు. మండపేట ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, రామచంద్రపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి చంద్రశేఖర్‌లు ఆ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులతో ఐక్యతారాగం ఆలపిస్తూ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారు. ఇక జనసేనకు కంచుకోటగా ఉందన్న కోనసీమ జిల్లాలో తక్షణమే పార్టీ అధిష్టానం జోక్యం చేసుకుని ఇన్‌చార్జిలను నియమించడంతోపాటు కేడర్‌కు దిశానిర్దేశం చేయాలని ఆ పార్టీ కేడరే ముక్తకంఠంతో కోరుతోంది. మొత్తం మీద జనసేనలో ఆయా నియోజకవర్గాల్లో పరిస్థితులను చక్కదిద్ది, కొత్త ఇన్‌చార్జులను నియమిస్తే ఎనలేని ఉత్సాహంతో కూటమి అభ్యర్థుల కోసం పనిచేస్తామని కేడర్ భావిస్తోంది. వెంటనే ఇన్‌చార్జులను నియమించాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.



చింతలూరు నూకాంబికా అమ్మవారి గవ్వ ఉత్సవం జరుగుతున్న దృశ్యం

ఘనంగా నూకాంబికా గవ్వ ఉత్సవం

ఆలమూరు, ఏప్రిల్8: గోదావరి జిల్లాల్లో పేరొందిన అమ్మవారి జాతరలలో ప్రధానంగా జరిగే చింతలూరు నూకాంబికా అమ్మవారి జాతర ఉత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. సోమవారం ఉదయం గవ్వ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. జాతర ఉత్సవాలకు గోదావరి జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. జాతరలో ప్రధానంగా గరగనృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంఎస్ఆర్ కృష్ణ, ఉత్సవ ప్రత్యేకాధికారి బాలాజీరామ్‌ప్రసాద్, జేఏ భాస్కర్‌శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సోమవారం తీర్థమహోత్సవానికి భక్తులకు తరలివచ్చారు. జాతర, తీర్థమహోత్సవాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాట్లను ఎస్ఐ శ్రీనునాయక్ చేశారు. చింతలూరు నూకాంబికా అమ్మవారి ఉత్సవాల్లో గవ్వ ఉత్సవానికి అధిక ప్రాధాన్యం ఉంది. దీంతో అమ్మవారి గవ్వ ఉత్సవం తిలకించడానికి భక్తులు వేచి ఉండి ఉదయం జరిగే గవ్వ ఉత్సవంలో అమ్మవారిని కోడిపిల్లను అందించి మొక్కులు తీర్చుకుంటారు. సోమవారం జరిగిన గవ్వ ఉత్సవం ఆకర్షించింది. ఈ ఉత్సవం అమ్మవారికి ముందుగా ఆలయ తరపున ఈవో కృష్ణ, బాలాజీ రామ్‌ప్రసాద్, భాస్కర్‌శ్రీనివాస్‌లు గవ్వలో కోడిని అందించి ప్రారంభించారు. భక్తులు కోడి, కోడిపిల్లలను అందించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి

అమలాపురంటౌన్, ఏప్రిల్8: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ సోమవారంతో ముగిసినట్టు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారి తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి మూల్యాంకన ప్రక్రియ చేపట్టి ఎనిమిది రోజుల్లో పూర్తిచేసినట్టు తెలిపారు. ఉన్నతాధికారులు నిర్దేశించిన సమయానికి మూల్యాంకన ప్రక్రియ పూర్తిచేసిన ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో ఎనిమిది సబ్జెక్టులకు సంబంధించి 1,88,918 పేపర్లను మూల్యాంకనం చేసినట్టు వివరించారు. 975 మంది సిబ్బంది పనిచేశారు. మూల్యాంకన ప్రక్రియను డీఈవోతోపాటు అసిస్టెంట్ కమిషనర్ ఎన్.సురేష్ పర్యవేక్షించారు. వచ్చే ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకన ప్రక్రియ నాటికి పదవీ విరమణ చేయనున్న పన్నెండు మంది సీనియర్ ఉపాధ్యాయులను డీఈవో దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. హెచ్ఎం రాజరాజేశ్వరి, టీఎస్ వీఎస్ సూర్యనారాయణమూర్తి, బందా ఆర్.కామేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం

విభిన్న ప్రతిభావంతులకు రూ.6 వేల పెన్షన్ హామీపై హర్షం

ఐ.పోలవరం, ఏప్రిల్ 8: తాను అధికారంలోకి వచ్చిన వెంటనే తమ పెన్షన్ మొత్తాన్ని రూ.6 వేలకు పెంచుతామని చంద్రబాబు హామీ ఇవ్వడంతో విభిన్న ప్రతిభావంతులు ఆనందం వ్యక్తంచేశారు. మురమళ్లలో సోమవారం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు జంపన రామభద్రరాజు, నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాడ రాజు, అధికార ప్రతినిధి బొంతు లక్ష్మీసూరిబాబు, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

మురమళ్లలో చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న దృశ్యం







కొమరాజులంకలో సచివాలయం తలుపులు మూసి గడియవేసి ఉన్న దృశ్యం.. వివాద స్థలం వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

మా భూమిని ఆక్రమించుకోవాలని చూస్తున్నారంటూ బాధితుల నిరసన

వైసీపీ సర్పంచ్ సచివాలయానికి గడియ పెట్టారంటూ ఆరోపణలు.. పూర్తి స్థాయి విచారణకు ఆదేశించామన్న ఎంపీడీవో

రావులపాలెం, ఏప్రిల్8: ఎన్నోఏళ్లుగా తమ స్వాధీనంలో ఉన్న భూమిని పంచాయతీ వారు అన్యాయంగా ఆక్రమించుకోవాలని చూస్తున్నారంటూ బాధితులు నిరసన వ్యక్తంచేసిన ఘటన రావులపాలెం మండలం కొమరాజులంకలో జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అడ్డగళ్ళ సూర్యకుమారి ఈ భూమి తనదని, వైసీపీ సర్పంచ్ ఈ భూమి పంచాయతీదని ఇద్దరి మధ్య గత కొంతకాలంగా వాదనలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారులు, బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. అనంతరం ఫిర్యాదులు ఉపసంహరించుకున్నారన్నారు. సచివాలయ సెక్రటరీ సదరు భూమిని ఖాళీచేయించమన్నా చేయించలేదని, తన ఫోన్‌ను లిఫ్ట్ చేయట్లేదని ఆగ్రహించిన వైసీపీ సర్పంచ్ ఉద్యోగులను బయటకు వెళ్లమని సచివాలయం తలుపులు వేసి గడియపెట్టారన్నారు. ఇదిలా ఉండగా కార్యదర్శి సబిత, ఎస్ఐ హరీష్ సిబ్బందితో స్థల వివాద ప్రాంతానికి చేరుకున్నారు. ఆ భూమిలో ఉన్న కంకరను తొలగించేందుకు జేసీబీ ట్రాక్టర్లను అక్కడకు తీసుకుని వెళ్లారు. అయితే ఈ భూమి తమదని, గత 11 ఏళ్ల కిందటే దీన్ని తాము కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకొన్నామని బాధితులు తెలిపారు. ఇది పంచాయతీ భూమి అని కార్యదర్శి, తమ భూమి అని బాధితుల మధ్య వాగ్వాదం జరుగుతున్న తరుణంలో గ్రామస్తులతోపాటు టీడీపీ నాయకులు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గుత్తుల పట్టాభిరామారావు, మాజీ ఉపసర్పంచ్ గుర్రాల నాగభూషణంతోపాటు పలువురు టీడీపీ నాయకులు అక్కడికి చేరుకుని బాధితులకు అండగా నిలబడ్డారు. దీనిపై నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామంటూ కార్యదర్శి అక్కడ నుంచి వెళ్లిపోవడంతో వివాదం సర్దుమణిగింది. కాగా సచివాలయానికి గడియపెట్టడంపై ఎంపీడీవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా కొమరాజులంక సచివాలయ సిబ్బంది ఎన్నికల శిక్షణ నిమిత్తం వెళ్లారని, గడియ పెట్టిన సంఘటన తన దృష్టికి రాలేదన్నారు. సచివాలయ కార్యదర్శి సబితను ఈ వివాద స్థలంపై పూర్తిస్థాయి నివేదికను అందించాలని ఆదేశించినట్టు తెలిపారు.



కాకినాడలో సంఘం శరణం గచ్ఛామి నాటక ప్రదర్శనలోని దృశ్యం

ఆకట్టుకున్న ‘సంఘం శరణం గచ్ఛామి’

▸▸ అంబేడ్కర్ జీవిత చరిత్రపై నృత్య రూపక నాటకం

పోర్టుసిటీ(కాకినాడ), ఏప్రిల్ 8: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై రూపొందించిన సంఘం శరణం గచ్ఛామి నృత్య రూపక నాటకం ఆకట్టుకుంది. కాకినాడ సూర్యకళామందిరంలో ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ప్రదర్శన హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి అయితాబత్తుల రామేశ్వరరావు, డాక్టర్ చెలికాని స్టాలిన్, గోపినాథ్, బేబీరాణి నివాళులర్పించారు.



అంబాజీపేటలో బహిరంగ సభా స్థలాన్ని పరిశీలిస్తున్న నేతలు, పోలీసులు

11న చంద్రబాబు, పవన్ సభల

ఏర్పాట్లు పరిశీలన

కొత్తపాలెంలో హెలిపాడ్‌కు ఏర్పాట్లు

సభా స్థలాన్ని పరిశీలించిన ఉమ్మడి పార్టీ శ్రేణులు

అంబాజీపేట, ఏప్రిల్ 8: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 11వ తేదీన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట నాలుగు రోడ్ల జంక్షన్‌లో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొననున్నారు. దీనికి సంబంధించి ఉమ్మడి పార్టీ శ్రేణులు సభా స్థలాన్ని, అధినేతలకు దిగేందుకు హెలిపాడ్ స్థలాలను సోమవారం పరిశీలించారు. అంబాజీపేట నాలుగురోడ్ల జంక్షన్‌లో అధినేత బహిరంగ సభ, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం సమీపంలోని కొత్తపాలెం ఓ ప్రైవేట్ లేఅవుట్‌లో హెలిపాడ్ స్థలాలను సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ కె.చిరంజీవి పరిశీలించారు. అలాగే సభా స్థలాన్ని టీడీపీ నియోజకవర్గ కోకన్వీనర్ నామన రాంబాబు, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, టీడీపీ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ పి.రాజశేఖర్ తదితరులు సభ నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. అధినేతలు చంద్రబాబు, పవన్ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు దాసరి వీరవెంకట సత్యనారాయణ, గణపతి వీరరాఘవులు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, సర్పంచ్ జల్లి బాలరాజు, నాయకులు వాసంశెట్టి కుమార్, గుడాల ఫణి, చిన్నం బాలవిజయరావు, అరిగెల సూరిబాబు, మైపాల తాతాజీ, దొమ్మేటి శ్యామ్, కొప్పినీడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అదేరోజు సాయంత్రం అమలాపురంలో అధినేతలు చంద్రబాబు, పవన్ సభలు ఉంటాయని పార్టీ వర్గాలు తెలిపాయి.



భౌతికశాస్త్ర నోట్స్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో కమలకుమారి

నూతన విద్యా సంవత్సరంలో కొత్త పాఠ్య పుస్తకాలు : డీఈవో

అమలాపురం టౌన్, ఏప్రిల్8: నూతన విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులకు నూతన పాఠ్య పుస్తకాలు రాబోతున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎం.కమలకుమారి తెలిపారు. దీంతో ప్రతీ పాఠ్యాంశానికి సంబంధించిన నోట్స్‌ను జిల్లాలోని ఉపాధ్యాయులు ప్రత్యేకంగా తయారు చేస్తున్నారన్నారు. ఏపీ ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లాశాఖ తరపున తయారుచేసిన పదో తరగతి భౌతికశాస్త్ర నోట్స్ పుస్తకాన్ని సోమవారం అమలాపురంలో డీఈవో ఆవిష్కరించారు. జిల్లాలోని పలువురు భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు ఈ నోట్స్‌ను తయారుచేశారని, పదో తరగతి పాఠ్య పుస్తకంలో చివరి అంశాలు, పాఠ్యాంశాల మధ్యలో ఏర్పాటుచేసిన కృత్యాలకు సంబంధించిన అంశాలకు పూర్తిస్థాయి వివరణతో కూడిన మెటీరియల్‌ను తయారుచేశారని, వాటిని ప్రతీ పాఠశాలకు అందజేస్తామని డీఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం అధ్యక్షుడు బెహరా సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి గిరజాల వీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఉపవిద్యాశాఖాధికారి శ్రీపాద లక్ష్మీనరసింహఫణి, డీసీఈబీ కార్యదర్శి హనుమంతరావు, బీఎస్ఎన్ మూర్తి, జీవీఎస్ సుబ్రహ్మణ్యం, అడబాల లక్ష్మీనరసింహారావు, శ్రీదేవి, దుర్గాభవానీ, శ్రీవల్లీ పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.3.28లక్షల నగదు సీజ్

అమలాపురం, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక తనిఖీ బృందాలు రూ.3.28 లక్షలు నగదును సీజ్‌చేసి రెండు కేసులు నమోదు చేసినట్టు జిల్లా ఎస్పీ కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాలతోపాటు పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించగా రావులపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో రూ.1.30 లక్షలు, ద్రాక్షారామ పీఎస్ పరిధిలో రూ.1.97 లక్షల నగదును సీజ్ చేసినట్టు పేర్కొంది. జొన్నాడ, గోపాలపురం, బొబ్బరలంక, దిండి, ఎదుర్లంక, నర్సాపురపుపేట చెక్‌పోస్టుల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తుండగా, ఎస్పీ ఎస్.శ్రీధర్, అడిషనల్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఐ.పోలవరం పీఎస్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో ఒక వ్యక్తిని అరెస్టుచేసి మూడు ఎన్డీపీ లిక్కరు బాటిళ్లు, 0.99 లీటర్ల ఐఎంఎల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ద్రాక్షారామ, అంగర, పామర్రు, రాయవరం పీఎస్‌ల పరిధిలో తొమ్మిది మందిని అరెస్టుచేసి తొమ్మిది ఎన్డీపీ, 5.2 లీటర్ల ఐఎంఎల్, 14 డ్యూటీపెయిడ్ లిక్కర్ బాటిళ్లు, 2.52 లీటర్ల ఐఎంఎల్‌ను, కారును స్వాధీనం చేసుకుని ఐదు కేసులు నమోదు చేశారు. అమలాపురం, ముమ్మిడివరం, ఆలమూరు, రామచంద్రపురం, కొత్తపేటలలో ఎస్ఈబీ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో ఎనిమిది మందిని అరెస్టు చేసి 8 ఎన్డీపీ లిక్కర్ బాటిళ్లు, 6.25 లీటర్ల ఐఎంఎల్, 60 డ్యూటీపెయిడ్ లిక్కర్ బాటిళ్లు, 10.8 లీటర్ల ఐఎంఎల్‌ను స్వాధీనం చేసుకుని 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసంచేసి 8 కేసులు నమోదుచేసినట్టు ఆ ప్రకటన తెలిపింది.

సాగునీరు అందక పంట పొలాలకు బీటలు

తమ పంటలను కాపాడాలని కలెక్టరేట్‌లో రైతుల వినతిపత్రం

అమలాపురం టౌన్, ఏప్రిల్8: అన్నదాతలకు సాగునీటి కష్టాలకు తెరపడడం లేదు. ఈనిక, పొట్ట దశలో ఉన్న పొలాలు సాగునీరు అందక బీటలు వారుతున్నాయని రాజోలు మండలం కడలి శివారు చెన్నడం ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. గెద్దాడ-1, 2 చానల్స్‌కు సాగునీరు అందించి పంటలను కాపాడాలని ఆ రైతులు వేడుకున్నారు. గత వారం రోజులుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్నామని, పంట పొట్టదశలో ఉందని, సాగునీరు విడుదల చేయకుంటే పంటను కోల్పోతామని వివరిస్తూ సోమవారం కలెక్టరేట్‌లో సరెళ్ల వెంకటరమణ తదితరులు అధికారులకు వినతిపత్రం అందజేసినట్టు వారు తెలిపారు.



అమలాపురం కలెక్టరేట్ వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు


చేబ్రోలులో పవన్‌కల్యాణ్ ఉగాది వేడుకల్లో పాల్గొనే ఇంటి వద్ద ఏర్పాటుచేసిన చలువ పందిరి

నేడు పవన్‌కల్యాణ్ రాక

- చేబ్రోలులో ఉగాది వేడుకల్లో పాల్గొననున్న జనసేనాని
- నూతన గృహ ప్రవేశం, ముస్తాబవుతున్న నివాస గృహం

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 8: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మంగళవారం పిఠాపురం నియోజకవర్గానికి రానున్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో జరగనున్న ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొననున్నారు. పిఠాపురం నియోజకవర్గంలోని 54 గ్రామాల్లో ఏదోకచోట ఇల్లు తీసుకుని ఉంటానని చెప్పిన పవన్‌కల్యాణ్ అందుకు తగ్గట్టుగా చేబ్రోలు బైపాస్‌రోడ్డులో 216వ జాతీయరహదారి చెంతనే నూతనంగా నిర్మించిన గృహాన్ని అద్దెకు తీసుకున్నారు. పవన్ నివాసముండేందుకు అనువుగా ఇంటిని తీర్చిదిద్దారు. నూతన గృహ ప్రవేశం చేయనున్నారు. ఇక్కడే జనసేన కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఉగాది వేడుకలను ఇక్కడే జరుపుకుంటానని పవన్ ప్రకటించిన నేపథ్యంలో చేబ్రోలులోని నివాసంలో అందుకు తగ్గ ఏర్పాట్లు చేయడంలో జనసేన శ్రేణులు నిమగ్నమయ్యాయి. ఇప్పటికే ఇంటి వద్ద చలువ పందిరిని నిర్మించారు. మామిడి తోరణాలతో ఇంటిని అలంకరిస్తున్నారు. ఇంటి ఆవరణలో ఏర్పాటుచేసిన చలువ పందిరిలోనే పవన్ ఉగాది వేడుకల్లో పాల్గొంటారని జనసేన నాయకులు చెబుతున్నారు. పంచాంగ శ్రవణం జరుగుతుంది. మంగళవారం ఉదయం 10గంటలకు గొల్లప్రోలు హెలిప్యాడ్‌కు చేరుకుని అక్కడి నుంచి చేబ్రోలు నివాసానికి చేరతారని సమాచారం. ఇంటిలోకి కొబ్బరికాయ కొట్టి ప్రవేశిస్తారు. ఇప్పటికే చేబ్రోలు నివాసంవద్ద పవన్ వ్యక్తిగత భద్రతా సిబ్బంది మోహరించారు. పనులు చేస్తున్న వారిని మినహాయించి మిగిలిన వారిని లోపలకు అనుమతించడం లేదు.

పూల మార్కెట్‌కు ఉగాది శోభ


కడియపులంక పూలమార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న పూలు

కడియం, ఏప్రిల్ 8: కడియపులంక అంతర్రాష్ట్ర పూలమార్కెట్ ఉగాది శోభను సంతరించుకుంది. రెండురోజుల నుంచి పూల అమ్మకాలు ఊపందుకున్నాయి. వేసవి తీవ్రతతో దిగుబడులు తగ్గాయని రైతులు అంటున్నారు. దీంతో పూల ధరలు పెరిగాయి. ప్రస్తుతం కడియపులంక పూలమార్కెట్‌లో పూలధరలు ఇలా ఉన్నాయి. మ ల్లెలు (కిలో) రూ.800, లిల్లీ (కిలో)రూ.100, పసుపు చామంతి (కిలో) రూ.250-300, వైట్ చామంతి(కిలో) రూ.300-350, నీలం చామంతి(కిలో) రూ.300, పసుపు బంతి(కిలో) రూ.50-80, కలకత్తా బంతి(కిలో) రూ.80-100, స్టార్ గులాబీ(కిలో) రూ.250, డచ్ (20పూలు) రూ.300, కనకంబరం (బారు-1) రూ.120-130, దేశవాళీ గులాబీ (100 పూలు) రూ.100 ఉన్నాయి.

కాటన్ బ్యారేజ్ చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో రూ.7 లక్షలు స్వాధీనం


ధవళేశ్వరంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

ధవళేశ్వరం, ఏప్రిల్ 8: సాధారణ ఎన్నికలు సందర్భంగా కాటన్ బ్యారేజ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టువద్ద సీఐ వినయ్‌మోహన్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నిడదవోలు నుంచి కారులో ప్రయాణిస్తున్న జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ డి.అనిత వర్ధిని నుంచి రూ.7,07,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యలు అనంతరం ఎఫ్ఎస్‌టీ టీంకు అప్పగించినట్టు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

పవరలో రూ.1.20 లక్షలు స్వాధీనం

సామర్లకోట, ఏప్రిల్ 8: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పవర గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపాన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఫకృద్దీన్ పాలెం గ్రామానికి చెందిన రెడ్డి గంగరాజు అనే వ్యక్తి ఎటువంటి పత్రాలు బిల్లులు లేకుండా తన వాహనంలో రూ.1.20లక్షల నగదు తీసుకెళ్తున్నట్టు గుర్తించి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పెద్దాపురం మండల వ్యవసాయాధికారి కె.సంజయ్‌కుమార్ స్వాధీనం చేసుకున్నట్లు పెద్దాపురం ఆర్వో సీతారామారావు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆర్వో మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న నగదును ట్రెజరీకి అప్పగించనున్నట్లు చెప్పారు.

అరచేతితో అడ్డుకుందాం..

- ఎన్నికల ఫిర్యాదులు.. సమాచారం కోసం ఏడు యాప్‌లు
- సామాన్య పౌరులను భాగస్వాములను చేస్తూ..
- కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో సామాన్య పౌరులను భాగస్వాములను చేస్తూ ఎన్నికల కమిషన్ పలు రకాల యాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చిందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం తెలిపారు. ఎన్నికల ఫిర్యాదులు, సమాచారం కోసం ఏడు యాప్‌లను ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. సార్వత్రిక ఎన్నికల నిబంధనావళి ఉల్లంఘన, ఇతర సమాచారల కోసం ఈ యాప్‌లను వినియోగించవచ్చు. సీ-విజిల్, సువిధ, కేవైసీ, అబ్జర్వర్, సాక్ష్యం, ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ యాప్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఓటర్లకు అవసరమైన సాయం, కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులు, ఎన్నికల ఖర్చు, పోలింగ్ బూత్‌ల వివరాలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గురించి సమాచారం తెలుసుకునేందుకు వీటిని ఉపయోగించుకోవచ్చునన్నారు.

నామినేషన్ల కోసం సువిధ యాప్

ఎన్నికల సమయంలో అభ్యర్థులు నామినేషన్ అనుమతి ప్రక్రియలో సహాయం చేసేందుకు సువిధ యాప్‌ను తీసుకువచ్చారు. పోటీచేసే అభ్యర్థులు ఖాతాను రిజిస్టర్ చేసుకుని వారి ఆధారాలతో లాగిన్ చేయాలి. ఆ తరువాత అభ్యర్థులు తమ నామినేషన్ల అనుమతిని యాప్‌లో చూసుకోవచ్చు. సువిధ క్యాండిడేట్ యాప్ అభ్యర్థులకు అనేక ఇతర ఫీచర్లు అందిస్తోంది. ప్రచారానికి అవసరమైన అనుమతుల గురించి తెలుసుకోవచ్చు.

ఎన్నికల ఉల్లంఘనలకు సీ-విజిల్ యాప్



ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా ఈ యాప్‌లో పొందుపరచవచ్చు. ఫొటో, వీడియో, ఆడియో రూపంలో రికార్డింగుచేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ జరిపి వంద నిమిషాల్లో ఫిర్యాదుపై ఖచ్చితమైన చర్యలు తీసుకుంటారు. పార్టీలకు అతీతంగా ఎవరు ఉల్లంఘనలకు పాల్పడ్డా ఫిర్యాదు చేయవచ్చు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలి. ప్రధానంగా ఎన్నికల్లో డబ్బులు పంపిణీ, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం. ఇటువంటి ఉల్లంఘనలను ఫొటో, వీడియో, ఆడియోలో క్లిప్‌లు అప్‌లోడ్ చేయాలి. వెంటనే జిల్లా ఎన్నికల అధికారి స్పందించి ఫిర్యాదుదారునికి తీసుకున్న చర్యలపై తెలుసుకునేవిధంగా వెసులుబాటు కల్పించారు.

ఓటరు హెల్ప్‌లైన్ యాప్



ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లో కొత్త ఓటర్ల నమోదు చేసుకోవచ్చు. ఓటర్ల జాబితాలో జనాభా వివరాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి ఫిర్యాదుల స్వీకరణకు ఈ యాప్ ఉపయోగపడుతుంది.

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్

ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారానికి, ఈసీకి సహాయం చేయడంలో నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ కీలకపాత్ర పోషిస్తోంది. ఓటరు తమ మొబైల్ నంబరు ఉపయోగించి పోర్టల్‌లో వారి ప్రొఫైల్ నమోదు చేసుకోవచ్చు. ఓటరు తమ ఫిర్యాదును నమోదుచేసిన తరువాత విచారణ కోసం ఎన్నికల అధికారికి పంపిస్తారు. నిర్ణీత వ్యవధిలోగా అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారు. పోలింగ్ బూత్ స్థానాలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఎన్నికల ఖర్చు, ఎన్నికల అక్రమాలకు సంబంధించిన ఫిర్యాదులను సకాలంలో ఈ యాప్ పరిష్కరిస్తోంది.

దివ్యాంగుల కోసం సాక్ష్యం యాప్



విభిన్న ప్రతిభావంతులైన దివ్యాంగులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంలో అవసరమైన వసతులు పొందేందుకు సాక్ష్యం యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. దివ్యాంగులకు వీల్‌చైర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఇతర వసతుల కోసం ఈ యాప్‌లో నమోదు చేసుకోవాలి. సంబంధిత అధికారులు దివ్యాంగులకు అవసరమైన అన్ని వసతులను కల్పించి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునే విధంగా యాప్ ఉపకరిస్తుంది.

సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థిగా లోతా రామారావు




రంపచోడవరం, ఏప్రిల్ 8: రంపచోడవరం సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థిగా లోతా రామారావు పేరును ఆ పార్టీ సోమవారం ఖరారు చేసింది. రాజవొమ్మంగి మండలం లోదొడ్డి పంచాయతీ కేశవరం గ్రామానికి చెందిన లోతా రామారావు ప్రస్తుతం గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగాను, రాజవొమ్మంగి మండలం లోదొడ్డి సర్పంచ్‌గాను ఉన్నారు. రామారావు గత కొన్నేళ్లుగా ప్రజాసమస్యలపై గిరిజన సంఘం, సీపీఎం పార్టీల తరుపున పోరాటాలు చేస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ పార్టీల పొత్తులో భాగంగా రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా లోతా రామారావు పోటీ చేయనున్నారు.

కిక్ బాక్సింగ్ విజేతకు నగదు ప్రోత్సాహకం


బహుమతిని అందజేస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 8: అఖిల భారత విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి కాంస్య పతకం సాధించిన సీహెచ్ దినేష్‌కు రూ.20 వేల నగదు ప్రోత్సాహకాన్ని వీసీ ఆచార్య కె.పద్మరాజు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మీరట్‌లోని స్వామీ వివేకానంద సుబర్తి విశ్వవిద్యాలయంలో జరిగిన చాంపియన్‌షిప్‌లో దినేష్ 81 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకు న్నారన్నారు. దినేష్ నన్నయ అనుబంధ కళాశాలయైన రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడని తెలిపారు. ప్రతిభా వంతులైన క్రీడాకారులకు విశ్వవిద్యాలయం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో క్రీడాబోర్డు కార్యదర్శి బి.రామ్ గోపాల్, కిక్ బాక్సింగ్ కోచ్ ఎం.భవానీశంకర్ పాల్గొన్నారు.



స్వయంభు తలుపులమ్మ తల్లి, నిర్మాణంలో ఉన్న మహా మండపం


పనులు పర్యవేక్షిస్తున్న ఆలయ ఇన్‌చార్జ్ డీసీ

నేటి నుంచి లోవతల్లి దర్శనం

- 15 నెలలుగా బాలాలయంలోనే దర్శనం

తుని రూరల్, ఏప్రిల్ 8: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం భక్తుల అవసరాలకు అనుగుణంగా ఆలయ పునఃనిర్మాణ పనులు చేపట్టడంతో గత 15నెలలుగా అమ్మవారు బాలలయంలోనే దర్శనమిస్తున్నారు. 4అంతస్తుల మహా మండపం, 9 అంతస్తుల రాజగోపురం నిర్మాణంతో పనులు చివరికి చేరడంతో అమ్మవారి ప్రధాన గర్భాలయంలో అమ్మవారి పునఃదర్శనాలు మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషన్ డి.విశ్వనాథ్‌రాజు తెలిపారు. మంగళవారం నుంచి ఐదురోజులు మహిళా భక్తులచే కుంకుమ పూజలు నిర్వహించనున్నారు.

4 అంతస్తుల మహా మండపం

ఆలయంలో పూర్వం ఉన్న క్యూలైన్‌లు తొలగించి ఆ స్థానంలో 4అంతస్తుల మహామండపం నిర్మిస్తున్నారు. మొదటి మండపంలో వినాయకుడి గుడి, టిక్కెట్ కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. 2వ మండలం షాపింగ్ కాంప్లెక్స్‌లు, 3వ మండపంలో భక్తులు వేచి ఉండేందుకు క్యూ కాంప్లెక్స్‌లు, 4వ మండపంలో అమ్మవారి పంచలోహ విగ్రహాల ఏర్పాట్లు, గర్భాలయంలో అమ్మవారిని దర్శించుకున్న తరువాత ఆశీర్వాదాలకు, పర్వదినాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 9 అంతస్తుల రాజగోపురం నుంచి దిగువకు మెట్లు నిర్మిస్తున్నారు. ప్రస్తుత రాజగోపుర నిర్మాణం దక్షిణం నుంచి తాత్కాలిక మెట్ల మార్గాన్ని ప్రధాన గర్భాలయంకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 15 నెలలు తరువాత అమ్మవారి దర్శన భాగ్యం కలుగనుండటంతో ఆలయంలో రద్దీ ఏర్పడే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా ఆలయ ఈవో సిబ్బందితో చర్చించి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు.

కొత్త సంవత్సరంలో..

గృహనిర్మాణశాఖ ఉద్యోగులకు జీతాలు అందేనా!

- అయోమయ పరిస్థితిలో ఉద్యోగులు

అమలాపురంరూరల్, ఏప్రిల్ 8: నేటి నుంచి శ్రీక్రోధి నామ సంవత్సరం ప్రారంభమవుతుంది. కొత్త సంవత్సరంలోనైనా జీతాలు విడుదల అవుతాయో లేదో తెలియని అయోమయ పరిస్థితి గృహనిర్మాణశాఖలో నెలకొంది. గృహ నిర్మాణశాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి ఈ నెలలో ఎనిమిది రోజులు గడిచిపోయినా ఇంత వరకు జీతాలు విడుదల చేయలేదు. అసలు ఈ నెలకు జీతాలు అందుతాయో లేదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గృహనిర్మాణ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఫిబ్రవరి, మార్చి నెలల జీతాలు విడుదల కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిబ్రవరి నెలకు సంబంధించి గృహనిర్మాణశాఖలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్లు, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్లకు మాత్రం మార్చి నెలలో జీతాలను చెల్లించారు. వారికి మార్చినెల జీతాలు విడుదల కాలేదు. గృహనిర్మాణశాఖలో ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు, ఇతర సిబ్బందికి జీతాలను ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తుందో తెలియని అయోమయ పరిస్థితి. గత కొంతకాలంగా ఇదే పరిస్థితి నెలకొంది. జీతాలు సకాలంలో విడుదల కాకపోవడంతో ఈఎంఐలు సకాలంలో చెల్లించక ఉద్యోగులు, సిబ్బంది బ్యాంకులకు డిఫాల్టర్లుగా మిగిలిపోతున్నామని ఆ శాఖ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రతీనెలా అప్పులుచేసి కుటుంబాలను గడుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

ఇద్దరు దింపు కార్మికుల మృతి

మలికిపురం, ఏప్రిల్ 8: గుడిమెళ్లంక గ్రామంలో నివాసం ఉంటున్న ఇద్దరు దింపు కార్మికులు వృత్తి రీత్యా పశ్చిమగోదావరి జిల్లా కాజా వైపు వెళుతుండగా పాలకొల్లు వైపు నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి వీరు ప్రయాణిస్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే వారు మృతిచెందినట్టు తెలిసింది. విశాఖ జిల్లా నక్కపల్లికి చెందిన కడియాల పెదమణియ్య(42), గూడి అప్పారావు(56)లు 15సంవత్సరాల క్రితం వృత్తి రీత్యా గుడిమెళ్లంక వచ్చి స్థిరపడ్డారు. దింపు పని కోసం వెళుతుండగా సోమవారం ఈ సంఘటన జరిగింది. అప్పారావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెదమణియ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ప్రమాదం ఘటన తెలిసిన వెంటనే స్థానికంగా ఉంటున్న సహచర దింపు కార్మికుల్లో విచారం అలుముకుంది.

21 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

నల్లజర్ల, ఏప్రిల్ 8: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని సీజ్‌చేసినట్టు సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఉదయం సివిల్ సప్లై, దేవరపల్లి పోలీసులు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి కాకినాడకు లారీలో 21 టన్నులు రేషన్ బియ్యం తరలిస్తున్నట్టు గుర్తించారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి, బియ్యాన్ని గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు.

యువకిడి ఆత్మహత్య


పాండ్రేకుల మహేష్

- స్నేహితుడి జ్ఞాపకాలు మరువలేక

యానాం, ఏప్రిల్ 8: యానానికి చెందిన యువకుడు తన స్నేహితుడి జ్ఞాపకాలు మరువలేక ఆత్మహత్య చేసుకున్నాడు. యానాం కుమ్మర్ల వీధికి చెందిన పాండ్రేకుల మహేష్(25) హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మహేష్ స్నేహితుడు చిక్కాల రత్నాకర్ గత ఏడాది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రాణస్నేహిడుతు ఆత్మహత్య మహేష్‌ను కొంత కలవరానికి గురిచేసింది. ఈనెల 4న రత్నాకర్ సంవత్సరికానికి హైదరాబాద్ నుంచి మహేష్ యానాం వచ్చాడు. స్నేహితుడి జ్ఞాపకాలతో మనస్తాపానికి గురైన మహేష్ ఆదివారంరాత్రి 11గంటల సమయంలో తాను చనిపోతున్నానని మరో మిత్రుడికి ఫోన్‌లో మెస్సేజ్ పంపాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో రాత్రంతా యానాం గోదావరి పరిసరాల్లో గాలించారు. కనకాలపేట సమీపంలో మహేష్ చెప్పులు, సెల్‌ఫోన్‌ను గుర్తించారు. మత్స్యకారుల సహాయంతో గాలించగా సోమవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. మృతదేహం వద్ద తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన స్నానం సరదా

- గోదావరిలో జారి యువకుడు మృతి


అశోక్‌కుమార్ (ఫైల్‌ఫోటో)

కడియం/ధవళేశ్వరం, ఏప్రిల్8: సరదాగా స్నేహితులతో కలిసి ఓ యువకుడు గోదావరి స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి ధవళేశ్వరం వద్ద గోదావరిలో గల్లంతయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. కడియం మండలం దుళ్లకు చెందిన బర్నికల అశోక్‌కుమార్(18) తన స్నేహితులతో కలిసి ఆదివారం సాయంత్రం ధవళేశ్వరంవద్దకు గోదావరి స్నానానికి వెళ్లాడు. స్నానానికి దిగుతుండగా నాచుకు జారి గల్లంతయ్యాడు. స్నేహితులు గమనించి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి అశోక్ మృతదేహాన్ని బయటకు తీశారు. ధవళేశ్వరం ఏఎస్ఐ శివాజీ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. అశోక్‌కు తల్లిదండ్రులతోపాటు పెళ్లి కావలసిన అక్క ఉన్నారు. అశోక్ పదో తరగతి చదువుతుండగా తండ్రి రాజు అనారోగ్యానికి గురికావడంతో చదువుకు స్వస్తి చెప్పి తాపీ పనిలో చేరాడు. అప్పటి నుంచి కుటుంబ భారమంతా తానే మోస్తున్నాడు. కుమారుడి మృతితో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.


హంస వాహనంపై ఊరేగుతున్న స్వామివారి

ఘనంగా అధ్యయనోత్సవాలు

- హంస వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

ఆత్రేయపురం, ఏప్రిల్ 8: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలకు ముందుగా నిర్వహించే అధ్యయనోత్సవాలు సోమవారం నాలుగవ రోజుకు చేరుకున్నాయి. క్షేత్రంలోని ముఖమండపంలో చతుర్వేద పారాయణం, ద్రవిడవేద పారాయణం వేదపండితులచే ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పల్లకి మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. రాత్రి గరుడ, సింహ, హంస వాహనాలపై స్వామివారు తిరువీధులలో విహరించి భక్తులకు కృపకటాక్షాలు అందించారు. మేళతాళ మంగళవాయిద్యాలు, బాణాసంచా కాల్పుల నడుమ గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. చంగోలం పారాయణం, నీరాజన మంత్రపుష్పం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఉపకమీషనర్, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అనంతబాబుపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- సీపీఎం నాయకుల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కొమరం పెంటయ్య

కూనవరం, ఏప్రిల్ 8: ఎమ్మెల్సీ అనంతబాబుపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఎం నాయకులు కొమరం పెంటయ్య, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య అన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగినవిలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న ఏజెన్సీలో అనంతబాబు అలజడి సృష్టిస్తున్నారన్నారు. ఎన్నికల ప్రచారం పేరుతో ఈ ప్రాంతంలో పర్యటించి అమాయక గిరిజనులపై దాడులు జరిపించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. రాత్రి వేళల్లో పర్యటించి తమ హక్కుల కోసం ప్రశ్నించిన రాము, వినోద్‌పై పోలీసుల చేత దారుణంగా కొట్టించారన్నారు. పోలీసులు సైతం అత్యుత్సాహం ప్రదర్శించి అమాయక గిరిజనులను కొట్టడం ఎంతవరకు న్యాయమన్నారు. ఇప్పటికే దెబ్బలు తిన్న యువకులను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి వారిని బెదిరించే ధోరణిలో మాట్లాడి కేసును పక్కదారి పట్టించారన్నారు. దీనిపై త్వరలోనే ఎన్నికల కమిషన్‌ను, పోలీసు ఉన్నతాధికారులను కలిసి న్యాయం జరిగే వరకు పోరాటం సాగిస్తామన్నారు. సీపీఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, తాళ్ళూరి శ్రీనివాసరావు, బొర్రయ్య, కర్నాటి శ్రీనివాసరావు, మురళీ, పాయం సత్యనారాయణ పాల్గొన్నారు.

రంప దేశం టికెట్‌ను పార్టీలో పనిచేసే వారికే ఇవ్వాలి

- మాజీ ఎమ్మెల్యేలు వంతల, శీతంశెట్టి డిమాండ్
- పార్టీ పరిశీలకుడు తీరుపైనా అధిష్టానానికి ఫిర్యాదు


రంపచోడవరంలో మాట్లాడుతున్న వంతల, శీతంశెట్టి

రంపచోడవరం, ఏప్రిల్ 8: రంపచోడవరం అసెంబ్లీ టికెట్‌ను టీడీపీలో పనిచేసిన వారికి మాత్రమే కేటాయించాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, శీతంశెట్టి వెంకటేశ్వరరావు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గొర్లె సునీత డిమాండ్ చేశారు. సోమవారం రంపచోడవరంలోని ఆర్కా అతిథి గృహ ఆవరణలో జరిగిన సమావేశ అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇక్కడ అభ్యర్థిని మార్చాలని కోరారు. ఇక్కడ అభ్యర్థిత్వం విషయంలో వివాదం పార్టీ అధినేత చంద్రబాబు పరిశీలనలో ఉండగా ఇక్కడ పార్టీ పరిశీలకుడు తన పరిధిని దాటి తానే అధిష్ఠానం అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పరిశీలకుడిగా ఇక్కడి వ్యవహారాలను పరిశీలించి, నివేదించాల్సిన బాధ్యతను విస్మరించి నాయకులను సస్పెండ్ చేస్తానంటూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయం దగ్గర పడిన నేపథ్యంలో ఇక్కడ పరిస్థితులను చక్కదిద్ది పార్టీలో పనిచేసిన వారికే టికెట్‌ను కేటాయించాలని కోరారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

మామిడికుదురు, ఏప్రిల్ 8: మామిడికుదురులోని అంబేడ్కర్ సామాజిక భవనంలో సోమవారం ఎస్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో ముస్లిం ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు కారుపల్లి కల్యాణ్‌బాబు, ప్రధాన కార్యదర్శి కొమ్ముల వీరరాఘవులు, సయ్యద్ రూహీ, జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్యపల్లంరాజు, నేరేడుమిల్లి సత్యనారాయణ, నాగిరెడ్డి శివప్రసాద్, చొప్పల రాంబాబు, మట్టా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం


పి.గన్నవరం: బీసీ సభలో గిడ్డి సత్యనారాయణ, కూటమి నాయకుల ఐక్యత

పి.గన్నవరం, ఏప్రిల్ 8: వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని పి.గన్నవరం కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ అన్నారు. కె.ఏనుగుపల్లిలో గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల సంపత్ అధ్యక్షతన జరిగిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రాబోయేది ఎన్‌డీఏ ప్రభుత్వమని, బీసీలకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు నామన రాంబాబు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్ బాబులు వైసీపీ ప్రభుత్వంలో బీసీలు జరిగిన అన్యాయాన్ని వివరించారు. అనంతరం గిడ్డి సత్యనారాయణను స్థానికులు దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంసాని పెద్దిరాజు, మట్టపర్తి రామకృష్ణ, తోలేటి సత్తిబాబు, బొంతు పెదబాబు, గణపతి వీరరాఘవులు, వాసంశెట్టి చినబాబు, యంత్ర శ్రీనివాసరావు, వాసంశెట్టి కుమార్, శేరు శ్రీనుబాబు, కుంపట్ల నాయుడు, మట్టపర్తి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

నేదునూరులో జయహో బీసీ సభ

అయినవిల్లి, ఏప్రిల్ 8: జయహో బీసీ కార్యక్రమం సోమవారం నేదునూరు గ్రామంలో క్లస్టర్ ఇన్‌చార్జి చిట్టూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. బీసీలకు 50ఏళ్లకే పెన్షన్ ఇస్తామని, పింఛన్ రూ.4వేలకు పెంచి అందించేలా మేనిఫెస్టోలో చంద్రబాబు ప్రకటించినట్టు నాయకులు పేర్కొన్నారు. బీసీలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావడం జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులకు ఓటువేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీ, జనసేన పార్టీల్లో చేరారు. నాయకులు మద్దాల సుబ్బారావు, నేదునూరి వీర్రాజు పాల్గొన్నారు.

పాలన గాడిలో పడాలంటే ఉమ్మడి ప్రభుత్వం రావాలి


కొత్తపేట: బీజేపీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు


ఆత్రేయపురం: టీడీపీలో చేరిన వారితో బండారు సత్యానందరావు

కొత్తపేట, ఏప్రిల్ 8: వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం ఐదేళ్లలో అభివృద్ధిలో కుంటిపడిందని, పాలన గాడిలో పడి అభివృద్ధి చెందాలంటే కచ్చితంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం స్థానిక కాపుకల్యాణ మండపంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ఆధ్వర్యంలో నియోజకవర్గ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు అధ్యక్షతన నియోజకవర్గ బీజేపీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా బండారు మాట్లాడుతూ చంద్రబాబు ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, అది రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ళ దొరబాబు, జాతీయ నాయకులు పురిగెళ్ళ రఘురావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమలు మాట్లాడుతూ నరేంద్రమోదీ నాయకత్వంలో ఎన్డీఏ కూటమి కేంద్రంలో, రాష్ట్రంలో అధికారం చేపట్టే విధంగా బీజేపీ శ్రేణులు కృషిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బండారుతో బీజేపీ శ్రేణులు చేతులు కలిపి సంఘీభావం తెలిపారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఇళ్ళ సత్యనారాయణ, పాలూరి జయప్రకాష్‌నారాయణ, మోకా సుబ్బారావు, గనిశెట్టి వెంకటేశ్వరరావు, చీకరమిల్లి శ్రీనివాసరావు, కోటిపల్లి దామోదర్, పాలాటి మాధవస్వామి, శిష్టా కుటుంబరావు, విళ్ళ దొరబాబు, కొనుకుపాటి శ్రీను, సంపద కనకేశ్వరరావు, కోటిపల్లి సుబ్రహ్మణ్యం, నల్లా శ్రీరామప్రసాద్, మహిళా మోర్చ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 8: కట్టుంగ గ్రామంలో 20మంది వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారికి కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు వారందరకీ పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. కష్టించి పనిచేసి పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ కరుటూరి నరసింహరావు, దొడ్డపనేని త్రినాధరావు, శ్రీధర్, కరుటూరి రవి, భీమరాజు, వందే విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కొండాలమ్మతల్లి జాతర మహోత్సవాలు ప్రారంభం



ముమ్మిడివరం, ఏప్రిల్ 8: కోరిన వెంటనే కోర్కెలు తీర్చే అమ్మవారిగా శ్రీకొండాలమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతీ ఏటా ఉగాది పండుగ నుంచి జాతర మహోత్సవాలు ప్రారంభించి ఎనిమిది రోజులు పాటు అత్యంత వైభవంగా జరుగుతాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈనెల12న అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజ, 16న గరగ పూజ, జాతర వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. లంక తల్లెమ్మ అమ్మవారికి, భాగిర్తమ్మవారికి సారె, చీర సమర్పించి ఉత్సవాలు ముగిస్తారు. 18న ఆలయ సన్నిధిలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పెద్దపెద్ద పందిళ్లువేసి, విద్యుత్ దీపాలతో అలంకరించి రంగులతో తీర్చిదిద్దారు. ఆలయ కమిటీ చైర్మన్ పెట్టా శివప్రసాద్, సభ్యులు ఎం.శ్రీనివాసరావు, బి.కుమార్‌రాజా, జి.శ్రీనుబాబు, కె.వెంకటేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, టి.రమణ, జె.మురళీ, పి.నాగరాజు, జి.రాజేష్‌లతో పాటు పలువురు ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు.

తాటాకిల్లు దగ్ధం

మండపేట, ఏప్రిల్ 8: కేశవరం దేవుళ్ళ కాలనీకి చెందిన బూలసుగు ఐమ్మకు చెందిన తాటకిల్లు సోమవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. మాజీ ఎంపీటీసీ తుపాకుల ప్రసన్నకుమార్ అనపర్తి అగ్నిమాపక సిబ్బందికి సమాచారంఇచ్చారు. స్థానికులు మంటలను అదుపుచేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్పివేశారు. రూ.50వేలు ఆస్తి నష్టం ఏర్ప డిందని బాధిత కుటుంబం, స్థానికులు తెలిపారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు.

ఐటీఐలో జాబ్ మేళా

యానాం, మార్చి8: యానాం నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ప్రభుత్వ ఐటీఐలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించినట్టు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణసుధాకర్ తెలిపారు. ఎల్‌అండ్‌టీ లిమిటెడ్ ప్రతినిధులు డి.కాంతారావు, రాజ్‌కుమార్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 59మంది హాజరుకాగా 47మందిఎంపిక య్యారు. వీరికి మూడు నెలలపాటు శిక్షణ అనంతరం ఆంధ్ర,తెలంగాణలో కంపెనీలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు.

- కూటమి అభ్యర్థులు హరీష్‌మాధుర్, దేవ వరప్రసాద్
- ప్రచార రథంపై గ్రామంలో పర్యటన
- ఉపాధి కూలీల సమస్యలు విన్న అభ్యర్థులు

తీరప్రాంత గ్రామాలను అభివృద్ధి చేస్తాం

అంతర్వేది, ఏప్రిల్ 8: తీర ప్రాంత గ్రామాలను అభివృద్ధి చేస్తామని పార్లమెంటు, అసెంబ్లీ కూటమి అభ్యర్థులు హరీష్ మాధుర్, దేవ వరప్రసాద్‌లు అన్నారు. అంతర్వేది ముత్యాలమ్మ గుడి వద్ద ఏర్పాటుచేసిన పరిచయ వేదిక సమావేశంలో కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. అనంతరం ఆయన ఆధ్వర్యంలో అంతర్వేదికి చెందిన పలువురు వైసీపీ నుంచి జనసేనలో చేరారు. అనంతరం నాయకులు, కార్యకర్తలను పరిచయం చేసుకుని తీర ప్రాంత గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. అనంతరం పార్లమెంటు అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌తో కలిసి వరప్రసాద్ ప్రచార రథంపై గ్రామంలో పర్యటించారు. అంతర్వేదిపాలెం రజక సంఘ నాయకులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు గ్రామంలో మార్గ మధ్యలో ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీ అందరికీ మంచి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు దీపాటి మితిన్, యెనుముల దుర్గాప్రసాద్, రాష్ట్ర నాయకులు, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, తాడి మోహన్‌కుమార్, దిరిశాల బాలాజీ, పోతురాజు కృష్ణ, ముప్పర్తి నాని, తిరుమాని ఆచార్యులు, గుబ్బల ఫణి, బైరా నాగరాజు, ఉండపల్లి అంజి, రావూరి నాగు, పోతురాజు వెంకటరత్నం, సరాగుల రాజారత్నం, బందెల పద్మ, జనసేన, టీడీపీ నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం వీవీమెరక గ్రామంలో కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి చేనేత వస్త్రాల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తాడి సత్యనారాయణ, జాన వీరభద్రరావు, ముప్పర్తి నాని, బత్తుల రమేష్, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.




అంతర్వేది: వైసీపీ నుంచి జనసేనలోకి ఆహ్వానిస్తున్న దేవ వరప్రసాద్, కాట్రేనికోన: బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలోకి వైసీపీ నాయకుడు మోకా అప్పాజీ

టీడీపీలో చేరిన వైసీపీ జిల్లా కార్యదర్శి

కాట్రేనికోన, ఏప్రిల్ 8: వైసీపీ జిల్లా కార్యదర్శి మోకా అప్పాజీ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి సోమవారం ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. ఆయనతో పాటు కాశి శివసాగర్, పత్తి నాగరాజు, జల్లి ఆగాస్టిన్, అవల ఏసు, బండే శ్రీనివాసరావు, గుత్తాల చంటి, నల్లా నాగరాజు, గుత్తాల బుజ్జి, మోకా శ్రీనివాసరావు, నక్కా రాంబాబు, నక్కా బుచ్చియ్య, నక్కా సత్యనారాయణ, నక్కా ఏసు, నక్కా వెంకన్న, అవాల మాణిక్యం, నక్కా గవరయ్య, నక్కా నారియ్య పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, విత్తనాల బుజ్జి, కోటిపల్లి సత్యనారాయణ, మోకా లోవరాజు, వాసంశెట్టి రాజేశ్వరరావు, రేవు రమేష్, సత్తాల ప్రసాద్, జొన్నాడ రాజారావు, గుబ్బల చంద్రరావు, జి.శ్రీను, విత్తనాల వెంకటరమణ, బొక్కా చిన్న, చెల్లి సురేష్, బీర అంబేడ్కర్, రాగుర్తి సత్యనారాయణ, జి.సూరిబాబు, జె.విజయ్, వీటీ వర్మ, బాబీరాజు పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ జాతర


మామిడికుదురు: నూకాలమ్మ పూజ గరగ ప్రదర్శన

మామిడికుదురు, ఏప్రిల్ 8: మామిడికుదురు గ్రామ దేవత నూకాలమ్మవారి జాతరను ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తీన్‌మార్ విన్యాసాలు, తమిళనాడు తంబోళ డప్పులు, చిత్రవిచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలతో పాటు భారీ బాణసంచా కాల్పులు నిర్వహించారు. అమ్మవారి ఆలయం నుంచి స్థానిక శివాలయం వరకు నిర్వహించిన పూజ గరగ ఊరేగింపులో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు సోమవారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. నాలుగు రోజులు జరిగే ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్టు కమిటీ తెలిపింది.

గ్రామదేవత మందాలమ్మ జాతర

ఉప్పలగుప్తం, ఏప్రిల్8: వాడపర్రు గ్రామదేవత మందాలమ్మ జాతరమహోత్సవాలు సోమవారంప్రారంభమయ్యాయి. మందాలమ్మకు భక్తులు ప్రారంభ పూజలుచేశారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. గొలకోటి వీరవెంకటసత్యనారాయణ(పొన్నయ్య)ఆధ్వర్యంలో అన్నసమారాధనజరిగింది.

యాబై ఏళ్ల తరువాత ఊడుగులమ్మ జాతర



ఆలమూరు, ఏప్రిల్ 8: నర్సిపూడి గ్రామదేవత ఊడుగులమ్మ అమ్మవారి జాతర, తీర్థమహోత్సవాలు 50ఏళ్ల తరువాత కోలాహలంగా జరిగాయి. కొన్ని అనివార్య కారణాలతో యాబైఏళ్లగా జాతరఉత్సవాలు నిర్వహించలేదు. అమ్మవారి పుట్టింటి, మెట్టింటివారి సహకారంతో గ్రామసోమేశ్వరస్వామి ఆలయ అర్చకులు కాళ్లకూరి కాశీశేఖర్‌బాబు ప్రాధ్వలంతో గ్రామస్తులు ఆదివారం రాత్రి జారత ఉత్సవాలు నిర్వహించారు. జాతర ఉత్సవాల్లో గరగనృత్యాలు, కాళీకాదేవి ప్రదర్శనలు, తీన్మార్ డ్యాన్స్‌లతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం అమ్మవారి తీర్థమహోత్సవం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఊడుగులమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవానికి కొత్తపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు.

ఘనంగా నూకాలమ్మ తీర్థం

కపిలేశ్వరపురం, ఏప్రిల్8: అంగర, కపిలేశ్వరపురం తదితర గ్రామాల్లో నూకాలమ్మ అమ్మవారి తీర్థం సోమవారం ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీర, రవిక, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కపిలేశ్వరపురం, అంగర గ్రామాల్లో ఆదివారం రాత్రి అమ్మవారి జాతరను గ్రామపురవీధుల్లో బ్యాండ్‌మేళాలు, గరగ నృత్యాలతో బాణసంచా కాల్పుల నడుమ వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు, అధిక సంఖ్యలో మహిళలు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీసుబ్బాలమ్మ జాతర



అమలాపురం టౌన్, ఏప్రిల్ 8: అమలాపురం గ్రామదేవత శ్రీసుబ్బాలమ్మవారి జాతరను సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. నూలువారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో చినజాగారం నిర్వహించారు. గరగ నృత్యాలు, మేళతాళాలతో అమ్మవారి జాతర జరిగింది. మంగళవారం తీర్థ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు శ్రీసుబ్బాలమ్మ, నూకాలమ్మ, రాజ్యలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం ఆలయ ఈవో బొక్కా వెంకటేశ్వరరావు తెలిపారు. ఉగాది సందర్భంగా అమ్మవార్ల తీర్థ నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేసినట్టు ఈవో తెలిపారు. ఈ నెల16న అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కూటమికి రెండు కళ్లు

ఆలమూరు, ఏప్రిల్ 8: రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజాసంక్షేమం కూటమి లక్ష్యమని, వీటిని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతున్నామని కూటమి కొత్తపేట నియోజకవర్గ అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. జొన్నాడలో సోమవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, బీజేపీ కన్వీనర్ ఎ.సత్తిబాబుగౌడ్‌లతో కలిసి బండారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జొన్నాడలో బండారుకు పూలవర్షంతో పాటు హారతులతో ఘనస్వాగతం పలికారు. పలువురు టీడీపీలో చేరారు. వీరికి బండారు కండువాలు వేసి స్వాగతించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైసీపీ ఎన్నికల ప్రచారంలో వలంటీరు

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 8: చల్లపల్లిలో సోమవారం జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో సచివాలయం-1 గ్రామవలంటీరు పాము నాగేశ్వరరావు పాల్గొనడంచర్చనీయాంశమైంది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వాలంటీరు ప్రచారంలో పాల్గొన్న వీడియోలను ఆ పార్టీకి చెందిన వారే వైరల్ చేయడం గమనార్హం. కాగా చల్లపల్లి ఎన్నికల ప్రచారంలో మంత్రి విశ్వరూప్ యెరుబండిచెరువు వెళ్ళకపోవడంతో ఆగ్ర హించిన ఆ ప్రాంతవాసులు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి, ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్, ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు, జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, ఉద్యానవన విశ్వవిద్యాలయ డైరెక్టర్ జిన్నూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



దీప్తిలో ఉగాది సంబరాలు

మామిడికుదురు, ఏప్రిల్ 8: మామిడికుదురు దీప్తి స్కూలులో ఉగాది వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి పంట పొలాల మధ్య మామిడిచెట్ల వద్ద సందడి చేశారు. ఉగాది పచ్చడిని అందరికీ పంచారు. కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భాగంగా పంచాంగ శ్రవణం జరిగింది.

జు-జిట్సు పోటీల్లో యశస్వినికి స్వర్ణం

అమలాపురంటౌన్, ఏప్రిల్8: లక్నోలో జరిగిన జు-జిట్సు నేషనల్ చాంపియన్ షిప్-2024 పోటీలుఅండర్-16లో 52కిలోల ఫైటింగ్ సిస్టమ్‌లో సమనస డిల్లీపబ్లిక్ స్కూలు విద్యార్థిని బొలిశెట్టి యశస్వినిస్వర్ణ పతకం దక్కించుకుంది. పాఠశాల డైరెక్టర్ నంద్యాల మనువిహార్, ప్రిన్సిపాల్ దేవిదీక్షిత్, కోచ్ పడాల అంజి, నంద్యాల నాయుడుసోమవారంఆమెనుఅభినందించారు.

కూటమి అభ్యర్థులకే ఎమ్మార్పీఎస్ మద్దతు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 8: కూటమి అభ్యర్థులకే ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ మద్దతు ప్రకటించినట్టు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి తెలిపారు. జిల్లాలో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావులను సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు కలుసుకున్నారు. గ్రామగ్రామాన పర్యటించి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లూటుకుర్తి చిన్నా తెలిపారు. హరీష్‌ను కలుసుకున్న వారిలో నాయకులు వీధి చిరంజీవి, పలివెల రాంబాబు, ఆకుమర్తి రమేష్, సత్తాల దుర్గారావు, మంద దుర్గారావు ఉన్నారు.

అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 8: ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ జన్మదిన వేడుకలను అమలాపురం పట్టణ అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వగ్రే శేషు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎర్రవంతెన వద్దనున్న గీతాశ్రమంలో అభిమానుల సమక్షంలో అల్లు అర్జున్ జన్మదిన వేడుకల కేక్‌ను కట్ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు ఆకుల బాబీకి గో దాణా నిమిత్తం ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో జాతీయ చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు యేడిద శ్రీను, పడాల నానాజీ, కోకా రాంబాబు, వగ్రే రవి, వి.చరణ్, శృంగవరపు ప్రసాద్, సాయిరాంబాబు, గుద్దటి మధు, మణికంఠ, శ్రీను పాల్గొన్నారు.

ముగిసిన పెద్దింట్లమ్మ ఉత్సవాలు

అంతర్వేది, ఏప్రిల్ 8: మెండుపాలెం గ్రామం చినకొల్లేరులో వెలసి ఉన్న శ్రీపెద్దింట్లమ్మ జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. ఉభయ గోదావరి జిల్లాల నుంచి విచ్చేసిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారంతో ఉత్సవాలు ముగియడంతో అమ్మవారి దర్శనానికి భక్తుల తాకిడి ఎక్కువైంది. మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది.

నేటి నుంచి వసంత నవరాత్రుల్లు

రాయవరం, ఏప్రిల్8: వెదురుపాక విజయదుర్గా పీఠంలో మంగళవారం నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు సోమవారం తెలిపారు. ఈనెల18 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఉగాది పురస్కరించుకుని అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, పీఠాధిపతి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: బహుముఖం
వెంకటరమణ	: భరతనాట్యం
శ్రీలలిత	: గో ఎట్ లైఫ్
శేఖర్ స్ర్కీన్-1	: మంజుమ్మల్‌బాయ్స్
శేఖర్ స్ర్కీన్-2	: ఓంబీమ్‌బుష్
రమా	: డీజేటిల్లు స్క్వేర్
గణపతి	: భీమా
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: ఫ్యామిలీ స్టార్
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: గాడ్జిల్లా అండ్‌కాంగ్

నమశ్శివాయకు మద్దతుగా బీజేపీ ప్రచారం



యానాం, ఏప్రిల్ 8: పుదుచ్చేరి లోక్‌సభ ఎన్‌డీఏ అభ్యర్థి ఏ.నమశ్శివాయకు మద్దతుగా బీజేపీ యానాం నాయకులు ప్రచారం నిర్వహించారు. యానాం శాఖ అధ్యక్షుడు కనకాల రాజు ఆధ్వర్యంలో బెజవాడగార్డెన్స్, కొత్తపేట, యర్రా గార్డెన్స్, చింతావారి వీధి, ఫ్రాన్స్‌తిప్ప, ఫ్లడ్‌బ్యాంక్ రోడ్డులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతు కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ తోనే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. నమశ్శివాయను యానాం నుంచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు డీవీవీ సత్యనారాయణ, కనకాల రామదాసు, నరసింహమూర్తి, సబ్బతి లోకేశ్వరరావు, లోకరాజు, కాకి నాగేశ్వరరావు, లక్ష్మీబాయ్ తదితరు నాయకులు, మహిళ మోర్చ, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పుదుచ్చేరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి వి.వైద్యలింగానికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్లాడి సత్తిబాబు, పార్టీ అధ్యక్షుడు అర్ధాది దినేష్ నేతృత్వంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. యానాం నియోజవర్గంలోని అంబేడ్కనగర్, కొత్తపేట, అగ్రహారం ప్రాంతాలకువెళ్లి కాంగ్రెస్ మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. స్వతంత్ర అభ్యర్థి అరదాడి పోసియ్యప్రచారం నిర్వహించారు.

కూటమి అభ్యర్థి విజయానికి కృషిచేయాలి

అంబాజీపేట, ఏప్రిల్ 8: కూటమి అభ్యర్థుల విజయాలకు కృషిచేయాలని అసెంబ్లీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ అన్నారు. పుల్లేటికుర్రులో టీడీపీ సీనియర్ నాయకుడు, ఎన్టీఆర్ యువసేన అధ్యక్షుడు వక్కలంక బుల్లియ్య జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బుల్లియ్యకు టీడీపీ, జనసేన నాయకులు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉగాదికి ఏర్పాట్లు పూర్తి

రావులపాలెం,ఏప్రిల్8: ఉగాది పురష్కరించుకుని అమ్మవారి జాతరలు, తీర్థాలు నిర్వహించారు. ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లను పూర్తిచేశారు. అమ్మవారి ఆలయాన్ని చలువపందిళ్లు, విద్యుత్‌దీపాలంకరణలతో తీర్చిదిద్దారు.

ఇంటి పన్నుల చెల్లింపునకు గడువు పెంపు

మండపేట,ఏప్రిల్8: పట్టణాల్లో ఉండే గృహ యజమానులు, దుకాణదా రులు, ఖాళీస్థల యాజమానులు పన్నులను ఈనెల 30వ వరకు చెల్లించ డానికి ప్రభుత్వం గడువు పెంచిందని మున్సిపల్ కమిషనర్ బి.రాము తెలి పారు. 2024-25ఏడాది పన్నులకు ఐదుశాతం రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు.

సెల్ షాపులో చోరీ

అమలాపురం టౌన్, ఏప్రిల్ 8: అమలాపురం చిన్నవంతెన వద్దనున్న క్రియేటీవ్ సెల్‌షాపులో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత చోరీ జరిగింది. సోమవారం ఉదయం యజమాని షాపు తెరిచేందుకు రాగా చోరీ జరిగినట్టు గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. షాపు పైభాగ ఉన్న రేకును తొలగించి షాపులోని 4సెల్‌ఫోన్లను చోరీచేసినట్టుగుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ తెలిపారు.

ముస్లిం మహిళపై దౌర్జన్యం అమానుషం

మామిడికుదురు, ఏప్రిల్ 8: నంద్యాల జిల్లా నందికొట్కూరులో తరావీ ప్రార్థనలు ముగించుకుని వెళుతున్న ముస్లిం మహిళపై సీఎం జగన్మోహన్‌రెడ్డి అనుచరుడు దాడి చేయడాన్ని టీడీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడు ముఖ్రం హుస్సేన్ తీవ్రంగా ఖండించారు. మహిళపై బుర్కా లాగి అసభ్యకరంగా ప్రవర్తించిన వైసీపీ నాయకుడిపై వెంటనే కేసు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో మీర్ అబ్రార్ హుస్సేన్, ఫర్హత్ అలీబేగ్, ఎంకే అబ్బాస్, మీర్‌కలం అలీ, ఫయాజ్‌జానీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఆర్చరీ పోటీల్లో జానకీరామ్‌కు పతకం



మామిడికుదురు, ఏప్రిల్ 8: పిఠాపురం డిగ్రీ కళాశాలలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ పోటీల్లో మాకనపాలేనికి చెందిన గెద్దాడ జానకీరామ్ మూడో స్థానం సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. జిల్లా స్థాయిలో జరిగిన ఇండియా రౌండ్స్ పురుషుల కేటగిరీలో ఈపతకంతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు. జానకీరామ్‌ను సోమవారం జిల్లా ఆర్చరీ సంఘ అధ్యక్షుడు జొన్నలగడ్డ గోపాలకృష్ణ, కోచ్‌లు చిట్టూరి చంద్రశేఖర్, బొంతు మధుకుమార్, అర్చక సంఘం కార్యదర్శి పి.లక్ష్మణరావు అభినందించారు.

యింటి కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక

మామిడికుదురు, ఏప్రిల్8: మామిడికుదురులో యింటి పేరు గల 120కుటుంబాలు సోమవారం కలుసుకుని సందడి చేశారు. కార్యక్రమానికి నాంది పలికిన విశ్రాంత ఇరిగేషన్ ఉద్యోగి యింటి వెంకటనారయణను ఘనంగా సన్మానించారు. ఇటీవల జాతీయ ఓటరు దినోత్సవంలో భాగంగా గవర్నర్ అబ్దుల్‌నజీర్ నుంచి అవార్డు అందుకున్న వీఆర్వో యింటి హరిదుర్గాప్రసాద్ దంపతులను సన్మానించారు. ధవళేశ్వరం, పేరు, నూజివీడు ప్రాంతాలకు చెందిన యింటి పేరు కలిగిన ఆత్మీయంగా కలుసుకుని సందడి చేశారు.

ఐరన్ షాపులో చోరీ

కొత్తపేట, ఏప్రిల్ 8: కొత్తపేట సత్యచంద్ర థియేటర్ సమీపంలో గల శ్రీశివసాయి స్టీల్స్ అండ్ సిమెంట్ షాపులో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. రావులపాలెం రూరల్ సీఐ రామ్‌కుమార్ తెలిపిన వివరాలివి. ఆదివారం రాత్రి వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్లిన యజమాని సోమవారం ఉదయం షాపు షెట్టర్ తెరిచి ఉండటాన్ని గుర్తించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనస్థలానికి చేరుకున్న పోలీసులు షాపులో ఉన్న సీసీ టీవీని పరిశీలించగా ఒక అగంతకుడు దుస్తులు ధరించకుండా ఒక బ్లూకలర్ డ్రాయిర్‌తో, మాస్క్ ధరించి షాపులో ఉన్న నగదును దొంగలించినట్లు గుర్తించారు. అమలాపురం నుంచి వచ్చిన క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించింది. యజమాని శకునాల వీరవెంకట సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జీవీ కృష్ణారావు తెలిపారు. ఈయన వెంట ట్రైనీ డీఎస్పీ స్వరూప్ ఉన్నారు.

మత సామరస్యానికి ఇఫ్తార్ ప్రతీక

అమలాపురం టౌన్, ఏప్రిల్ 8: మత సామరస్యానికి ఇఫ్తార్ విందు ప్రతీకగా నిలుస్తుందని కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. అమలాపురం మొల్లాముస్తఫా మసీదులో సోమవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆనందరావు పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మసీదు కమిటీ ప్రతినిధులు ఎండీ ఆజామ్, మహ్మద్‌ఖాజా షరీఫ్, ఎండీషరీఫ్, ఎండీ మున్వర్, షఫీ కరీముల్లా బాబా, కోనసీమ ముస్లిం వెల్ఫేర్ అధ్యక్షుడు ఎండీ బషీర్, తెలుగు యువత నాయకుడు చెరుకూరి సాయిరామ్, సర్కిల్ రాజాఅబ్బాస్ పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

రాజోలు, ఏప్రిల్8: ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా స్వీప్‌నోడల్ అధికారి బీవీ రమణ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో దివ్యాంగులతో సోమవారం సమావేశం నిర్వహించారు. జిల్లా పరిధిలో 85శాతం ఓటింగ్ లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులను, కళాకారులను భాగస్వాములను చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర, తహసీల్దార్ గోపాలకృష్ణ, సఖినేటిపల్లి, మలికిపురం, మామిడికుదురు మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలపై పడిన తాడిచెట్టు..తప్పిన ప్రమాదం

ముమ్మిడివరం, ఏప్రిల్ 8: తాడి చెట్టు విద్యుత్ తీగలపై పడి రోడ్డుకు అడ్డంగా పడింది. ముమ్మిడివరం-కాట్రేనికోన ఆర్‌అండ్‌బీ రోడ్డులో సూరాయి చెరువు వద్ద సోమవారం సాయంత్రం రోడ్డు పక్కన ఉన్న తాడిచెట్టు ఎల్టీ, 11కేవీ తీగలపై పడింది. దీంతో ఆ విద్యుత్ తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో అటుగా ఎవరు వెళ్లకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. మూడు గంటలసేపు సూరాయిచెరువు, అయినాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి తాడిచెట్టును, తీగలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి సరఫరాను పునరుద్ధరించారు.

వ్యక్తి మృతిపై అనుమానాస్పద కేసు

పి.గన్నవరం, ఏప్రిల్ 8: పి.గన్నవరం శివారు తాటమ్మతల్లి వీధిలో షేక్ ఖాజా(45) మృతిపై అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపిన వివరాలివి. కోడిమాంసం దుకాణంలో పనిచేస్తున్న ఖాజా తన కుటుంబంతో కొంతకాలంగా తాటమ్మ తల్లి గుడివీధిలో నివాసం ఉంటున్నాడు. ఈనెల4న కుటుంబ సభ్యులందరూ ఒక కార్యక్ర మానికి ద్రాక్షారామ వెళ్లారు. అప్పటి నుంచి కోడిమాంసం దుకాణం దగ్గరకు రాకపోవడంతో యజమాని ఖాజా బంధువును వాకబు చేశాడు. ఇంటికి వెళ్లి చూసేసరికి తలుపు గొళ్లంపెట్టి ఉంది. గోడపై నుంచి పరిశీలించగా ఖాజా ఒరండాలో మృతి చెంది ఉండటాన్ని గమనించాడు. కొంతకాలంగా అతడు మద్యానికి బానిసయ్యా డని బంధువులు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహాన్ని అమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసినట్లు ఎస్ఐతెలిపారు.